835) ఆహిరి

ప॥ జీవాత్మపై యుండు చిలుకా నీ- । వావలికి పరమాత్మడై యుండు చిలుకా॥

చ॥ ఆతుమపంజరములోన నయమున నుండి నా- । చేతనే పెరిగిన చిలుకా।
జాతిగా కర్మపు సంకెళ్ళ బడి కాల- । జేత బేధైతివే చిలుకా॥

చ॥ ఖ్యాతిగా చదువులు పగలురేలును నా- । చేత నేరిచినట్టి చిలుకా।
రీతిగా దేహంబురెక్కలచాటున నుండి । సీతుకోరువ లేని చిలుకా॥

చ॥ బెదరి అయిదుగురికిని భీతి పొందుచు కడు । జెదరగ జూతువే చిలుకా।
అదయులయ్యిన శత్రులారుగురికిగాక । అదిరి పడుదువే నీవు చిలుకా॥

చ॥ వదలకిటు యాహారవాంఛ నటు పదివేలు- । వదరులు వదరేటి చిలుకా।
తుదలేని మమతలు తోరమ్ము సేసి నా- । తోగూడి మెలగిన చిలుకా॥

చ॥ నీవన నెవ్వరు నేనన నెవ్వరు । నీవే నేనైయుందు చిలుకా।
శ్రీవేంకటాద్రిపై చిత్తములో నుండి । సేవించుకొని గట్టి చిలుకా॥

చ॥ దైవమానుషములు తలపించి యెపుడు నా- । తలపున బాయని చిలుకా।
యేవియును నిజముగా వివి యేటికని నాకు । నెఱిగించి నటువంటి చిలుకా॥